# పది పరీక్షలకు వేళాయె..

- ఏప్రిల్ 3 నుంచి ప్రారంభం
- అర్బన్, రూరల్ నియోజకవర్గాల్లో 8,969 మంది హాజరు

**రాజమహేంద్రవరం రూరల్:** పదో తరగతి పబ్లిక్ పరీక్షలంటే విద్యార్థులతో పాటు తల్లిదండ్రులకు కూడా పరీక్షే. ఏడాదంతా కష్టపడి చదివిన పాఠ్యాంశాలను మంచి మార్కులుగా మలుచుకోవడానికి మరెన్నో రోజుల సమయం లేదు. ఏప్రిల్ 3 నుంచి టెన్త్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభం అవుతున్నాయి. మంచి మార్కులు సాధించాలంటే పక్కా ప్రణాళికతో జవాబులు రాయాలి. పరీక్షల సమయంలో విద్యార్థులు ఏ మాత్రం మానసిక ఒత్తిడికి గురవకుండా తల్లిదండ్రులు చూడాలి. వారిలో ఒత్తిడి, ఆందోళన, భయం, అనారోగ్యం వంటి వాటిని దూరం చేసేందుకు ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యుల తోడ్పాటు చాలా అవసరం. రాజమహేంద్రవరం అర్బన్, రూరల్ నియోజకవర్గాల్లో 119 ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలల నుంచి 8,969 మంది విద్యార్థులు ఈ ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతున్నారు.


పదో తరగతి విద్యార్థులు

### ఒత్తిడి లేకుండా..

విద్యార్థులు పరీక్షల్లో ఎక్కువ మార్కులు తెచ్చుకోవాలనే ఉద్దేశంతో తల్లిదండ్రులు వారిపై ఒత్తిడి పెట్టకూడదు. వారిలో ఆత్మవిశ్వాసం దెబ్బతినకుండా చూడాలి. మానసిక పరిస్థితిని అర్థం చేసుకొని, సున్నితంగా వ్యవహరించాలి. స్ఫూర్తిని నింపేలా మెలగాలి. ఇంట్లో చదువుకునేందుకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలి. టీవీలు పెట్టడం, అనవసర సంభాషణలు చేయకూడదు. వేళకు మితంగా ఆహారం ఇవ్వాలి. వీలైనంత వరకూ తాజా పండ్లు పెట్టాలి.

### జాగ్రత్తలు అవసరం

- విద్యార్థులు తమను తోటివారితో పోల్చుకోరాదు.
- పక్కవారి గురించి ఆలోచించడం వల్ల ఒత్తిడి పెరుగుతుంది
- ఏ సమస్య వచ్చినా వెంటనే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు చెప్పాలి
- వెనుకబడిన సబ్జెక్టులపై దృష్టి సారించాలి, ఎల్లప్పుడూ పాజిటివ్ ఆలోచనలతో గడపాలి
- తగినంత సేపు నిద్రపోవాలి. సరైన ఆహార నియమాలు పాటించాలి
- సరిపడా నీరు తాగాలి

**పరీక్షల టైం టేబుల్**
ఏప్రిల్ 3న తెలుగు, కాంపోజిట్ పేపర్, 6న హిందీ, 8న ఇంగ్లిషు, 10న గణితం, 13న సైన్స్(ఫిజికల్, బయోలాజికల్), 15న సోషల్ స్టడీస్ పరీక్షలు నిర్వహిస్తారు. ఉదయం 9.30 నుంచి 12.45 గంటల వరకూ జరుగుతాయి.

### పరీక్షలంటే భయం పోగొట్టారు



పరీక్షల సమయంలో ఎలాంటి ఒత్తిడికి గురి కాకూడదని మా ఉపాధ్యాయులు చెప్పారు. ముఖ్యంగా మనసులో సహజంగా ఉండే భయాన్ని జయించాలన్నారు. పదో తరగతిలో మంచిమార్కులు సాధించడానికి ప్రణాళికబద్ధంగా చదువుతున్నాం.
– రావూరి సంయోన్, హుకుంపేట హైస్కూలు

### చేతిరాతలో మెళకువలు



మంచి మార్కులు సాధించడానికి పరీక్షల్లో చేతిరాత ముఖ్యమని ఉపాధ్యాయులు వివరించారు. సమాధాన పత్రంలో రాసే జవాబు సూటిగా ఉండడంతో పాటు అక్షరాలు పొందికగా ఉండాలన్నారు. పేజీకి 16 నుంచి 20 లైన్లకు మించి రాయకూడదన్నారు. అవన్నీ పాటించి మంచి మార్కులు తెచ్చుకుంటాం.
– వి.హిమ వెంకటరత్నం, శాటిలైట్ సిటీ హైస్కూలు

### విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



ఉత్తీర్ణత శాతం పెంపు లక్ష్యంగా శ్రమిస్తున్నాం. ప్రత్యేక తరగతుల ద్వారా విద్యార్థులకు బోధన అందేలా చర్యలు తీసుకున్నాం. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ కనబరచాలని ఉపాధ్యాయులకు సూచించాం. ప్రతి విద్యార్థి పరీక్షా సమయానికి అరగంట ముందుగానే సెంటర్‌కు చేరుకోవాలి.
– బి.దిలీప్‌కుమార్, డీఐ, రాజమహేంద్రవరం అర్బన్

# మహిళా సంక్షేమమే జగనన్న సంకల్పం

- ఎంపీ భరత్‌రామ్
- వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కు పంపిణీ

**రాజమహేంద్రవరం సిటీ:** మహిళా సంక్షేమమే జగనన్న సంకల్పమని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. స్థానిక 88వ సచివాలయం పరిధి పీ అండ్ టీ కాలనీలో 43, 44, 47 డివిజన్లకు చెందిన వైఎస్సార్ ఆసరా లబ్ధిదారులకు మంగళవారం సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ జగన్ పాదయాత్ర సమయంలో అక్కాచెల్లెమ్మలకు డ్వాక్రా రుణ మాఫీపై హామీ ఇచ్చారన్నారు. దానికి కట్టుబడి నాలుగు విడతల్లో 80 లక్షల మంది మహిళలకు సంబంధించి రూ.25వేల కోట్లు మాఫీ చేస్తున్నారన్నారు. ఇప్పటికి మూడు విడతల్లో రూ.19 వేల కోట్లు మాఫీ చేశారన్నారు. రానున్న ఎన్నికలలో రాజమహేంద్రవరం ఎంపీ, ఎమ్మెల్యేలుగా వైఎస్సార్ సీపీ అభ్యర్థులనే గెలిపించినప్పుడే సంపూర్ణ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అనంతరం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కటౌట్‌కు మహిళలు క్షీరాభిషేకం చేశారు.

**టీడీపీ నాయకుల కుతంత్రాలు**
ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ రాష్ట్రంలో పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు రాకుండా కోర్టుల ద్వారా అడ్డుపడింది తెలుగుదేశం పార్టీ నాయకులేనని, అందువల్లే ఇంత జాప్యం జరిగిందన్నారు. ప్రస్తుతం ఇళ్ల సమస్యకు సంబంధించి కోర్టులో మనకు అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. త్వరలోనే లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందించి, ఇళ్లను కట్టించి, గృహప్రవేశాలు కూడా చేయిస్తానని హామీ ఇచ్చారు. టీడీపీ నాయకుల కుట్రలు, కుతంత్రాలను ప్రజలే సమర్థంగా తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, నగర పాలక సంస్థ అడిషనల్ కమిషనర్ పి.సత్యవేణి, లక్కోజు ఓంకార్, బూరాడ భవానీ శంకర్, చోడిశెట్టి సత్యవాణి, క్లస్టర్ ఇన్‌చార్జి పోలు విజయలక్ష్మి, గాండ్ల తెలుకుల కార్పొరేషన్ చైర్మన్ సంకిస భవానీ ప్రియ, పాలిక శ్రీను, మజ్జి అప్పారావు పాల్గొన్నారు.


వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కు అందజేస్తున్న ఎంపీ భరత్‌రామ్

**మోరంపూడి మనతోనే సాధ్యం**
మోరంపూడి జంక్షన్‌లో ఫ్లైఓవర్ నిర్మాణం జగన్ పాలనలోనే సాధ్యమైందని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. వైఎస్సార్ ఆసరా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం నగరంలోని వీఎల్ పురం విఘ్నేశ్వరుని గుడి వద్ద 9, 10, 11 డివిజన్లకు సంబంధించి డ్వాక్రా మహిళలతో సమావేశం నిర్వహించారు. ఎంపీ మాట్లాడుతూ మోరంపూడి బ్రిడ్జి టీడీపీ హయాంలో మంజూరైనా, దాన్ని ఆచరణలో పెట్టడంతో నాయకులు విఫలమయ్యారన్నారు. ఒకసారి కేన్సిల్ అయిన ఎఫ్ఓబీ మళ్లీ శాంక్షన్ చేయించడం చాలా కష్టమని, అయినా పార్లమెంటులో ప్రస్తావించి కేంద్రంలో పెద్దలను ఒప్పించి తిరిగి మంజూరు చేయించానన్నారు. తాను ఎంపీగా ఉండగానే లాలా చెరువు, బొమ్మూరు, దివాన్ చెరువు, వేమగిరి ఫ్లైఓవర్ బ్రిడ్జిలకు శంకుస్థాపన చేస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో దాసి వెంకట్రావు, ఆరే చిన్ని, గౌరీ శంకర్ పాల్గొన్నారు.


కొంతమూరులో నమూనా చెక్కు అందజేస్తున్న ఏపీజీఅండ్‌బీసీచైర్మన్, రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్

**కొంతమూరులో..**
**రాజమహేంద్రవరం రూరల్:** రాష్ట్రంలో 80 లక్షల మందికి పైగా ఉన్న డ్వాక్రా మహిళల రుణమాఫీ కోసం రూ.25 వేల కోట్లను నాలుగు దఫాలుగా ఇచ్చేందుకు సీఎం జగన్ హామీ ఇచ్చారని, దానిని తప్పకుండా అమలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్, ఆంధ్రప్రదేశ్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. కొంతమూరు ఈఏఆర్ ఎయిడెడ్ హైస్కూల్ ఆవరణలో మంగళవారం జరిగిన మూడోవిడత వైఎస్సార్ ఆసరా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో మూడు విడతల్లో రూ.829.44 కోట్లను మహిళల ఖాతాల్లో జమ చేశారన్నారు. రూరల్ మండలంలో 2,636 డ్వాక్రా గ్రూపులకు రూ.22.78 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. మండల మహిళా సమాఖ్య అధ్యక్ష, కోశాధికారి గొల్లు లక్ష్మి, మారే వెంకటలక్ష్మి, మహిళా సంఘాల సభ్యులతో కలిసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి చందన నాగేశ్వర్ క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఏపీ పాస్టర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు కోలమూరు ప్రభాకరరావు, డీఆర్‌డీఏ-వైఎస్సార్ క్రాంతిపథం ఏరియా కో ఆర్డినేటర్ వై.జనార్దనరావు, ఏపీఎం పి.మహేష్, పంచాయతీ కార్యదర్శి విజయారెడ్డి, హితకారిణి సమాజం డైరెక్టర్ దేవులపల్లి సరితారాణి, వక్ఫ్‌బోర్డు ఉపాధ్యక్షుడు ఎంఎం ఆలీ, మాజీ సర్పంచ్‌లు ఆచంట వెంకట సుబ్బారాయుడు, అత్తిలి భీమశంకరం, మాజీ ఉప సర్పంచ్ షేక్ మౌలాలి, కాతేరు సొసైటీ చైర్‌పర్సన్ ఆచంట కల్యాణ్, రూరల్ జేసీఎస్ కన్వీనర్ తాటికొండ విష్ణుమూర్తి, సచివాలయ కన్వీనర్లు పిన్నమరెడ్డి సూర్యచంద్రరావు, చెరుకూరి సత్యనారాయణ, గాబ్రియేల్, తీటి ప్రసాద్, సత్తిబాబు, చానా, ఆనందరావు, సోమిరెడ్డి సత్తిబాబు పాల్గొన్నారు.

## 30న శ్రీరామ శోభాయాత్ర


శోభాయాత్ర పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

**సీటీఆర్ఐ:** శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 30న నగరంలో శ్రీరామ శోభాయాత్ర పేరుతో భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు శ్రీరామ ఉత్సవ సమితి ప్రతినిధులు వెల్లడించారు. శోభాయాత్రకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఉపాధ్యక్షుడు గండేపూడి సురేష్, బండ్ల శంకర్, కామవరపు శ్రీరామ్ మాట్లాడుతూ ప్రజల్లో ధర్మనిష్ఠ, దేశభక్తి పెంచడానికి ఈ ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. 30వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు పుష్కరఘాట్ వద్ద ప్రారంభమయ్యే ఈ ర్యాలీలో సుమారు 15 వేల మంది పాల్గొంటారన్నారు. ఇప్పటికే 10 వేల మందికి పైగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. పుష్కరఘాట్ నుంచి ఆర్యాపురం, నందం గనిరాజు జంక్షన్, గోరక్షణపేట, ఏవీఏ రోడ్డు, పాత సోమాలమ్మ ఆలయం, ఆర్టీసీ కాంప్లెక్స్, స్టేడియం రోడ్డు మీదుగా సుమారు 10 కిలోమీటర్ల మేర యాత్ర నిర్వహించి మళ్లీ పుష్కరఘాట్‌కు చేరుకుంటామన్నారు. శ్రీనివాసానంద సరస్వతి స్వామిజీ మంగళాశాసనాల అనంతరం ప్రవచనం ఉంటుందని, ఆ తర్వాత యాత్ర ప్రారంభమవుతుందన్నారు. సమావేశంలో అధ్యక్షుడు దినేష్ వైష్ణవ్ పాల్గొన్నారు.

## నైపుణ్యాభివృద్ధితో మహిళల అభ్యున్నతి


శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ మాధవీలత, కార్పొరేషన్ కమిషనర్ దినేష్‌కుమార్, రుడా చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి తదితరులు

- కలెక్టర్ మాధవీలత
- ఘనంగా షర్మిలారెడ్డి జన్మదిన వేడుకలు

**సీటీఆర్ఐ:** మహిళల అభ్యున్నతికి స్వచ్ఛంద సంస్థలు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని కలెక్టర్ మాధవీలత అన్నారు. ఎంఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలోని హైటెక్ బస్టాండ్ పైఅంతస్తులో ఏర్పాటు చేసిన మహిళా నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఈ సంస్థను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా షర్మిలారెడ్డికి కలెక్టర్ మాధవీలత, నగరపాలక సంస్థ కమిషనర్ దినేష్‌కుమార్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ మహిళలు ఆర్థిక సాధికారత సాధిస్తే ఆ కుటుంబం స్థితిగతులు మెరుగవుతాయన్నారు. అందులో భాగంగానే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను మహిళల పేరుతో ఇస్తున్నారన్నారు. రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి మాట్లాడుతూ తన మావయ్య మేడపాటి సీతారామమూర్తి నుంచి స్ఫూర్తి పొంది, నేడు ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

**సేవా కార్యక్రమాలు**
రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని నగరంలో అనేక చోట్ల సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వృద్ధులకు దుప్పట్లు, మహిళలకు చీరలను పంపిణీ చేశారు. గౌతమీ జీవకారుణ్య సంఘం వృద్ధుల ఆశ్రమంలో ఎంఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అత్యవసర చికిత్సా విభాగాన్ని ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ కర్రి రామారెడ్డి, ఫస్టు ప్లస్ ఆసుపత్రి అధినేత క్రిటికల్ కేర్ నిపుణులు డాక్టర్ బీఆర్ కళాధర్ రెడ్డి ప్రారంభించారు. వృద్ధులకు అత్యవసర చికిత్స చేయడానికి అవసరమైన వైద్య పరికరాలను కూడా అక్కడ ఏర్పాటు చేశారు.

## ఫిషర్‌మెన్ సొసైటీ అధ్యక్షుడిగా క్రాంతి ప్రకాష్

**కడియం:** వేమగిరి ఫిషర్‌మెన్ సొసైటీ అధ్యక్షుడిగా మెల్లిమి క్రాంతి ప్రకాష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వేమగిరి ఎస్సీపేట ప్రాథమిక పాఠశాలలో మంగళవారం నిర్వహించిన ఎన్నికలో సొసైటీ పాలకవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ఎం.బ్రహ్మానందం తెలిపారు. అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శులతో పాటు, ఆరుగురు డైరెక్టర్ల పదవులకు ఒక్కో నామినేషన్ మాత్రమే నిర్ణీత సమయానికి అందడంతో వీరందరినీ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. ఉపాధ్యక్షుడిగా సరెళ్ల పెద్దిరాజు, కార్యదర్శిగా నక్కా పాపారావు, డైరెక్టర్లుగా పులిదిండి మధుకుమార్, పి.జయలక్ష్మి, కొండా రాంబాబు, శీలి సత్తి పండు, కె.రాంబాబు, వీరా నిర్మల ఎంపికయ్యారు. అధ్యక్షుడు క్రాంతి ప్రకాష్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్, పార్టీ మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్రస్టాలిన్, మాజీ సర్పంచ్ వెలుగుబంటి వెంకటాచలం సహకారంతో ఏకగ్రీవంగా ఎంపికైనట్లు వివరించారు. పార్టీ నాయకులు వెలుగుబంటి వెంకటాచలం, విప్పర్తి ఫణికుమార్, కట్టా జమీందారు, యడ్ల రాజారమేష్, మెల్లిమి భాస్కరరావు, జేగురుపాడు ఎంపీటీసీ ఆకుల సుధాకర్ తదితరులు పాల్గొని నూతన కార్యవర్గాన్ని అభినందించారు. ఎన్నిక సందర్భంగా కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ పీవీజీ తిలక్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.


వేమగిరి ఫిషర్‌మెన్ సొసైటీ పాలకవర్గం

## 'పలుకు' పాఠశాలకు వితరణ

**అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్):** ఆల్కాట్ తోటలోని పలుకు బధిరుల ఆశ్రమ పాఠశాలకు స్పీచ్ ట్రెనింగ్ సాఫ్ట్‌వేర్ కోసం రూ.1.65 లక్షలను రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి అందించారు. మంగళవారం ఆమె జన్మదిన వేడుకలను పలుకు ఆశ్రమ పాఠశాలలో షర్మిలారెడ్డి అభిమానుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలతో కలిసి కేక్ కట్ చేశారు. పలుకు నిర్వహకురాలు ఘంటా కనకదుర్గ, రమణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పిల్లలకు భోజనాలు ఏర్పాటు చేశారు.

## చందన నాగేశ్వర్ పరామర్శ

**ధవళేశ్వరం:** వైఎస్సార్ సీపీ నాయకుడు బర్రి కామేశ్వరరావును ఆ పార్టీ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ మంగళవారం పరామర్శించారు. కామేశ్వరరావు కుమార్తె ఆకస్మిక మృతికి సంతాపం తెలిపారు. భౌతికకాయానికి నివాళులర్పించారు. ఆయన వెంట హితకారిణి సమాజం డైరెక్టర్ దేవులపల్లి సరితారాణి, వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్, నాయకులు గోలి దేవకుమార్, రేగుళ్ల రాజు, డాక్టర్ చొల్లంగి సత్యగిరి, చాటకాల చంటి ఉన్నారు.

## క్లుప్తంగా

### జేసీ తేజ్ భరత్‌కు అభినందనలు


జేసీ తేజ్ భరత్‌ను అభినందిస్తున్న కలెక్టర్ మాధవీలత

**సీటీఆర్ఐ:** ప్రతిభ కలవారికి గుర్తింపు తప్పనిసరిగా లభిస్తుందని కలెక్టర్ మాధవీలత అన్నారు. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో జేసీ తేజ్ భరత్‌ను రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్, తూర్పుగోదావరి జిల్లా యూనిట్ ఉద్యోగులు అభినందించారు. ఇటీవల ముస్సోరిలోని లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్‌లో శిక్షణ పొందిన జేసీ తేజ్ భరత్.. అక్కడ 139 మంది ఇతర అధికారులతో పోటీ పడి, రాత పరీక్షల్లో మొదటి స్థానం సాధించారు. భారత్ దర్శనం గ్రూప్ విభాగంలో కూడా మొదటి స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు గొలుగూరి బాపిరాజు, గౌరవ అధ్యక్షుడు మక్బూల్ ఆలీ, కలెక్టర్ ఆఫీస్ యూనిట్ సెక్రటరీ కంఠం ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ రామారావు, సీసీలు గోపీచంద్, నాగేంద్ర పాల్గొన్నారు.

### పలువురికి కంటి పరీక్షలు


కంటి శిబిరంలో పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

**రాజమహేంద్రవరం రూరల్:** ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రత్యేక సేవాశిబిరంలో భాగంగా మంగళవారం తొర్రేడులో రక్తదాన, కంటి వైద్యశిబిరాలు నిర్వహించారు. వీటిని అసోసియేట్ డీన్ డాక్టర్ సీహెచ్.శ్యాంరాజ్ నాయక్, తొర్రేడు సొసైటీ చైర్‌పర్సన్ చిట్టూరి వెంకట్రావు ప్రారంభించారు. ధన్వంతరి వలంటరీ బ్లడ్ సెంటర్ నిర్వాహకులు వ్యవసాయ కళాశాల విద్యార్థులు, కోఆపరేటివ్ బ్లడ్‌డోనర్స్ నుంచి రక్తం సేకరించారు. శ్రీరామ్ ఐకేర్ సెంటర్ వైద్యులు గ్రామస్తులకు కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యుడు దండమూడి అర్జునరావు, సీఈవో కేవీవీ సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఎస్.హైమజ్యోతి, డాక్టర్ కె.రవికుమార్, డాక్టర్ పి.అమ్మాజీ పాల్గొన్నారు.

### సామాజిక తనిఖీ ప్రజావేదిక



మాట్లాడుతున్న డ్వామా పీడీ రాంగోపాల్

**రాజమహేంద్రవరం రూరల్:** మండలంలో పనులను గుర్తించి, ఉపాధి హామీ కూలీలకు వంద రోజుల పని కల్పించాలని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ జీఎస్ రాంగోపాల్ సూచించారు. ఉపాధి పథకం రూరల్ మండలానికి సంబంధించి మంగళవారం హుకుంపేట మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో కె.రత్నకుమారి అధ్యక్షతన సామాజిక తనిఖీ ప్రజావేదిక జరిగింది. పీడీ రాంగోపాల్ మాట్లాడుతూ మండలంలో వివిధ శాఖల సమన్వయంతో రూ.11,06,98,870 ఖర్చు చేశామన్నారు. పంచాయతీరాజ్ ఏఈ సంపత్, మండల పరిషత్ పరిపాలనాధికారి సుబ్బారావు, డ్వామా హెచ్ఆర్ మేనేజర్ డీవీఏ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

### బైబిల్ మిషను మహాసభలు ప్రారంభం


మహాసభల్లో మాట్లాడుతున్న విజయరాజు

**సీటీఆర్ఐ:** స్థానిక క్వారీ మార్కెట్ సమీపంలో బైబిల్ మిషను 56వ మహాసభలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. బైబిల్ మిషన్ ప్రెసిడెంట్ బిషప్ డాక్టర్ ఎస్.విజయరాజు ప్రారంభ ప్రార్థన చేశారు. కేథడ్రల్ సభ్యులు, గోల్డెన్ జూబిలీ మందిర విశ్వాసులు, స్వస్థతశాల సభ్యులు బైబిల్ మిషన్ తెలుగు క్రైస్తవ కీర్తనలు ఆలపించారు. ఈ సందర్భంగా విజయరాజు మాట్లాడుతూ ఏసుక్రీస్తు శిలువ శ్రమకాలంలో క్రైస్తవులందరూ మహాసభలకు చేరి, శిలువ ధ్యానంలో పాలుపంచుకోవాలని సూచించారు బుధ, గురు వారాల్లో జరిగే మహాసభలకు రాష్ట్ర నాయకులు, క్రైస్తవ పెద్దలు హాజరవుతారన్నారు. బైబిల్ మిషన్ గవర్నింగ్ బాడీ సభ్యులు షఖినాబాబు, శామ్యూల్ కిరణ్, ఆనంద్ సుధాకర్ ప్రసంగించారు.

### కలెక్టరేట్ వద్ద ధర్నా

**సీటీఆర్ఐ:** పోలవరం ప్రాజెక్టు నీటి సామర్థ్యం తగ్గించే ఆలోచన మానుకుని, పూర్తిస్థాయి 45.72 మీటర్ల నీటిమట్టంతో నిర్మించే వరకూ పోరాటం చేస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు అన్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక కలెక్టరేట్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. కేంద్ర ప్రభుత్వం పోలవరం సామర్థ్యాన్ని 150 అడుగుల నుంచి 90 అడుగులకు కుదించడం వల్ల ప్రాజెక్టు నీటి సామర్థ్యం తగ్గిపోతుందన్నారు. దీనివల్ల రాయలసీమ ఎక్కువ నష్టపోతుందన్నారు.

### వైఎస్సార్‌టీయూసీ ఆవిర్భావ దినోత్సవం


కార్మికులకు భోజనాలు వడ్డిస్తున్న ముద్దాల అను

**రాజమహేంద్రవరం రూరల్:** వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ బలోపేతానికి కృషి చేస్తున్నట్టు జిల్లా అధ్యక్షుడు ముద్దాల తిరుపతిరావు(అను) అన్నారు. బొమ్మూరు పంచాయతీ కార్యాలయంలో కార్మికుల సమక్షంలో మంగళవారం వైఎస్సార్‌టీయూసీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పంచాయతీ కార్మికులతో కేక్ కట్ చేయించారు. అనంతరం ఏపీజీఅండ్‌బీసీచైర్మన్, వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ సౌజన్యంతో కార్మికులకు భోజనాలు ఏర్పాటు చేశారు. పార్టీ నాయకులు యెనుముల త్యాగరాజు, ఎలుగొండ లక్ష్మి, మత్సేటి శివ, కోటిపల్లి రవికుమార్, బందిల మణి పాల్గొన్నారు.

### పోస్టల్ బీమాతో ప్రయోజనం


బాధితుడికి బీమా చెక్కు అందజేస్తున్న దృశ్యం

**ప్రకాశం నగర్:** పోస్టల్ శాఖ నిర్వహిస్తున్న రూ.399 బీమా పథకం ఎంతో ప్రయోజనకరమని గోదావరి పరిరక్షణ సమితి అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. స్థానిక పేపరుమిల్లు ఎదురుగా ఉన్న కృష్ణసాయి కల్యాణ మండపంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే వలంటీర్లు, డ్రైవర్ల సంక్షేమార్థం 470 మందికి ఉచితంగా ప్రమాద బీమా చేయించినట్లు చెప్పారు. ఈ పథకంలో తొలి క్లెయిమ్‌ను ప్రమాద బాధితుడైన దిలీప్‌కు రూ.18 వేల బీమా చెక్కును విశ్వేశ్వరరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ ఎస్.రాజేష్, ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంకు సీనియర్ మేనేజర్ సీహెచ్ వంశీకృష్ణ, పోస్టల్ అసిస్టెంట్ మేనేజర్ బి.ఝాన్సీ పాల్గొన్నారు.

### వసతి గృహాల తనిఖీ

**కంబాలచెరువు:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశానుసారం సంక్షేమ వసతి గృహాలను తనిఖీ చేస్తున్నట్టు ఆ సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి అన్నారు. స్థానిక న్యాయ సేవాసదన్ ప్రాంగణంలో మంగళవారం పారా లీగల్ వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. అనంతరం నగరంలోని వసతి గృహాలను తనిఖీ చేశారు. ఆర్ట్స్ కళాశాలలోని గిరిజన బాలుర వసతి గృహాన్ని సందర్శించి అక్కడ వసతులను పరిశీలించారు. ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహాన్ని సందర్శించారు.

### మాజీ ఎంపీటీసీ పాపాయమ్మ మృతి

**రాజమహేంద్రవరం రూరల్:** కాతేరు గ్రామ మాజీ ఎంపీటీసీ, టీడీపీ రాష్ట్ర నాయకురాలు మోర్తా పాపాయమ్మ (58) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. ఆమె భర్త మోర్తా వెంకటరావు సీపీఐ (ఎంఎల్)న్యూడెమోక్రసీ పార్టీలో నాలుగు దశాబ్దాలకు పైగా ఉద్యమాలు సాగించారు. ఆయన నాలుగేళ్ల క్రితం కన్నుమూశారు. పాపాయమ్మకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆమె అంత్యక్రియలు బుధవారం నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

### వ్యక్తి అదృశ్యం

**రాజమహేంద్రవరం రూరల్:** తన తండ్రి నజీర్ కనిపించలేదని రాజమహేంద్రవరం రహమత్‌నగర్‌కు చెందిన షేక్ మహమ్మద్ షరీఫ్ మంగళవారం సాయంత్రం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. 58 ఏళ్ల షేక్ నజీర్ పాత ఇనుము వ్యాపారం చేస్తుంటాడు. మంగళవారం ఉదయం పాత ఇనుము వ్యాపారుల వాట్సాప్ గ్రూప్‌లో ఆయనను కించపరుస్తూ మేసేజ్ వచ్చింది. దీంతో మనస్థాపం చెంది ఉదయం 10.30 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. హెడ్ కానిస్టేబుల్ వీఎస్ఎస్ ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### భర్త అదృశ్యంపై..

**రాజమహేంద్రవరం రూరల్:** తనతో గొడవపడి వెళ్లిన భర్త ఇప్పటివరకు తిరిగి రాలేదని బొమ్మూరు గ్రామానికి చెందిన డి.దుర్గ మంగళవారం పోలీసులకు పిర్యాదు చేసింది. వివివివరాల్లోకి వెళితే.. బొమ్మూరుకు చెందిన డి.సుబ్రహ్మణ్యం, అతడి భార్య దుర్గ ఈ నెల 25వ తేదీన గొడవపడ్డారు. ఈ నేపథ్యంలో బయటకు వెళ్లిన భర్త సుబ్రహ్మణ్యం ఇప్పటివరకు తిరిగిరాలేదు. హెడ్ కానిస్టేబుల్ ఎస్వీవీ రమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### గోదారమ్మకు సిందూరం


బ్రిడ్జిల నడుమ సూర్యాస్తమయం

**రాజమహేంద్రవరం సిటీ:** పుష్కరఘాట్ వద్ద మంగళవారం సాయంత్రం అద్భుత దృశ్యం కనువిందు చేసింది. రెండు వంతెనల మధ్య గోదారమ్మ నుదుట సిందూరంగా సూర్యాస్తమయం జరిగింది. దీంతో ఫొటోలు, సెల్ఫీలు తీసుకునే సందర్శకులతో ఘాట్ కళకళలాడింది. దీనిపై దేవీచౌక్‌లోని బోస్ అన్వేషణ్ సెంటర్ నిర్వాహకుడు, కోరుకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు బీరక వీఎల్ఎస్ ఆనంద్ బాబు మాట్లాడుతూ భూపరిభ్రమణాన్ని బట్టి సూర్యుడు ఉదయించే, అస్తమించే స్థలం ఏ ఒక్కరోజు ఒకేలా ఉండదన్నారు. కానీ గ్రీనిచ్ రేఖపై మార్చి 21న పగలు, రాత్రి సమానంగా ఉంటాయన్నారు. రాజమహేంద్రవరంలో మార్చి 21 తర్వాత 26, 27 28 తేదీల్లో ఇలా సూర్యాస్తమయం కనిపిస్తుందన్నారు.